కాంగ్రెస్‌లో చేరిక.. లేదిక!

- ఆహ్వానిస్తున్న కమిటీ.. అడ్డుపడుతున్న ఎమ్మెల్యేలు
- చేతులెత్తేసిన చేరికల కమిటీ
- దీపాదాస్‌కు చెప్పాకే చేరికలు

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): హలో! ఎవరైనా ఉన్నారా? రండి.. వచ్చి కాంగ్రెస్‌లో చేరండి.. మంచి తరుణం మించితే దొరకదు అంటూ కాంగ్రెస్ చేరికల కమిటీ చేసిన ప్రకటన మూన్నాళ్ల ముచ్చటే అయింది. టీపీసీసీ చేరికల కోసం ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటుచేసింది. అయితే ఇది ఏర్పడి వారం రోజులు తిరక్కముందే ఇకపై తమ సమక్షంలో చేరికలు ఉండవని, చేరాలనే ఆసక్తి ఎవరికైనా ఉంటే పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీనే సంప్రదించాలంటూ చేతులు ఎత్తేసింది. అసలు ఏం జరిగింది? ఎవరైనా వచ్చి కాంగ్రెస్‌లో చేరవచ్చని ఆహ్వానించి హడావుడి చేసిన కమిటీ వెనక్కి తగ్గడానికిగల కారణం ఏమిటి? అని పార్టీలో చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్‌లో చేరికల కథాకమామిషు ఏమిటని ఆరా తీస్తే ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. చేరికల కోసం ముగ్గురితో త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసి అందులో తమను నియమించి, తీరా పరువు తీశారని వారు వాపోతున్నారు. అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది కాబట్టి పార్టీలో ఎవరైనా చేరవచ్చని ప్రకటన ఇస్తే.. ఇప్పుడేమో, ఎవడంటే వాడి మెడలో పార్టీ కండువా కప్పుతారా? అని మంత్రులు, ఎమ్మెల్యేలు ఎదురుతిరగడంతో చేరికల కమిటీ కంగుతిన్నది. పొద్దున పార్టీలో చేర్చుకోవడం.. సాయంత్రానికి వారి చేరికలను నిలిపివేసినట్టు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి నుంచి ప్రకటన రావడం నిత్యకృత్యంగా మారింది. ఇది తమ పరువు తీసినట్టు అవుతున్నదని చేరికల కమిటీ ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇక నుంచి పార్టీలో ఎవరైనా చేరాలనుకుంటే నేరుగా దీపాదాస్ మున్షీని కలవండి అని చేరికల కమిటీ చైర్మన్ జగ్గారెడ్డి ప్రకటించి చేతులు దులుపుకున్నారు.

గేట్లు తెరిచినా..ఫలితం లేదని...

కాంగ్రెస్‌లో చేరికలకు గేట్లు తెరిచినట్టు పార్లమెంట్ ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించినప్పటికీ పెద్దగా చేరికలు జరుగలేదు. పరిస్థితి ఆశాజనకంగా లేకపోవడంతో ఎమ్మెల్యేలు, ఎంపీలే కాకుండా చోటామోటా నాయకులు వచ్చినా చేర్చుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వానికి అధిష్ఠానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఇటీవల హైదరాబాద్ వచ్చిన సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీల నుంచి ఎవరు వచ్చినా చేర్చుకోవాలని పీసీసీని ఆదేశించి వెళ్లారు. ఈ మేరకు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు జగ్గారెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్, కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండారెడ్డితో చేరికల కమిటీ ఏర్పాటు చేశారు. ఎవరైనా వచ్చి కాంగ్రెస్‌లో చేరవచ్చు.. కండువాలు కప్పేందుకు మేం సిద్ధంగా ఉన్నామని కమిటీ చైర్మన్ జగ్గారెడ్డి ప్రకటించారు.

పొద్దున చేరికలు.. సాయంత్రం నిలిపివేత

కొందరు చోటామోటా నాయకులతోపాటు గత ఎన్నికలలో కాంగ్రెస్ టికెట్ దక్కక పార్టీకి రాజీనామా చేసిన నాయకులు, తిరుగుబాటు అభ్యర్థులుగా బరిలోకి దిగిన వారు గాంధీభవన్‌కు వస్తే చేరికల కమిటీ వారికి కండువాలు కప్పింది. అలా చేరిన వారిలో దేవరకద్ర నుంచి అసెంబ్లీ ఎన్నికలలో టికెట్ ఆశించి భంగపడి పార్టీకి రాజీనామా చేసిన కే ప్రదీప్ గౌడ్ ఒకరు. ఈయన పార్టీలో చేరిన రోజు సాయంత్రమే ఆయన చేరికను నిలిపేసినట్టు దీపాదాస్ మున్షీ ప్రకటించారు. తనకు టికెట్ రాలేదన్న అక్కసుతో పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేసిన నాయకుడిని తిరిగి ఎలా చేర్చుకుంటారని స్థానిక ఎమ్మెల్యే, మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తనతో సంప్రదించకుండా చేర్చుకోవడాన్ని నిరసిస్తూ మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి ప్రచారాన్ని నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో దిక్కుతోచని దీపాదాస్ మున్షీ ఈ చేరికను నిలిపివేయక తప్పలేదని చెప్తున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ భార్గవ, 13 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లతో వచ్చి గాంధీభవన్‌లో చేరికల కమిటీతో పార్టీ కండువా కప్పుకున్నారు. వీరి చేరిక కూడా సేమ్ టు సేమ్ మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఆగ్రహం తెప్పించింది. తమను సంప్రదించకుండా ఎలా చేర్చుకున్నారని వారు దీపాదాస్ మున్షీకే నేరుగా ఫోన్ చేసి నిలదీసినట్టు సమాచారం. దీంతో వీరి చేరికను కూడా నిలిపేసినట్టు ఆమె ప్రకటించక తప్పలేదు. భువనగిరి నియోజకవర్గానికి చెందిన గోడ శ్రీనివాస్‌గౌడ్, రాహుల్ గౌడ్, చిన్నం శ్రీనివాస్ గౌడ్ తదితరులు కూడా చేరికల కమిటీ ప్రకటనతో గాంధీ భవన్‌కు వచ్చి పార్టీ కండువా కప్పుకున్నారు. తనతో సంప్రదించకుండా వీరిని ఎలా చేర్చుకున్నారని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ మండిపడటంతో వీరి చేరికలను కూడా నిలిపివేశారు.

మాకొద్దు.. ఈ కమిటీ

పొద్దున కండువా కప్పడం.. సాయంత్రానికి వారి చేరికలను నిలిపేసినట్టు దీపాదాస్ మున్షీ ప్రకటించడంతో తాము చేరికల కమిటీ నుంచి తప్పుకుంటున్నట్టు సభ్యులు ముగ్గురు చెప్పారు. ఇక నుంచి ఎవరైనా పార్టీలో చేరదల్చుకుంటే నేరుగా దీపాదాస్ మున్షీనే సంప్రదించాలని జగ్గారెడ్డి పత్రికాముఖంగా ప్రకటించారు.

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఎల్ఐసీ కార్యాలయంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్

ఈసీ గీత దాటిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

- గోదావరిఖని ఎల్ఐసీ ఆఫీసులో ప్రచారం
- బీఎం, ఏబీఎం, ఇతర సిబ్బందితో సమావేశం

పెద్దపల్లి, మే 2 (నమస్తే తెలంగాణ): రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ ఎన్నికల సంఘం నిబంధనలను తుంగలో తొక్కారు. పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరుతూ గురువారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఎల్ఐసీ కార్యాలయంలో ప్రచారం చేశారు. ఓట్లు అభ్యర్థించడమే గాక కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎల్ఐసీ కార్యాలయ ఆవరణలోనే బ్రాంచ్ మేనేజర్ నందిగాం శ్రీనివాస్‌రావు, ఏబీఎం నాగేంద్రకుమార్, ఏవో శ్రీనివాస్‌తో కలిసి సిబ్బంది, ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈసీ నిబంధనలకు నీళ్లొదులుతూ సదరు నేత చేసిన పనికి ఆ సంస్థ బ్రాంచి మేనేజర్, మరో ఇద్దరు అధికారులు సహకరించడమే కాకుండా ఏకంగా సమావేశ వేదికను అలంకరించి మద్దతు పలికారు. అంతకుముందు కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యేను ఎల్ఐసీ బ్రాంచి ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సన్మానించి స్వామి భక్తిని చాటుకున్నారు. ఇన్సూరెన్స్ సంస్థ అధికారులు వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమావేశంలో పాల్గొన్న మక్కాన్ సింగ్ చేతిగుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వంశీని గెలిపిస్తే ఏజెంట్ల సంఘ భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం. ఎల్ఐసీ కార్యాలయంలో ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవడంతోపాటు అందుకు సహకరించిన బ్రాంచి మేనేజర్, సిబ్బందిపైనా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అమిత్ షా కో న్యాయం.. నాకో న్యాయమా?

- కేంద్రాన్ని నిలదీసిన కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): 'అమిత్ షాకో న్యాయం.. నాకో న్యాయమా? ఆయన ఫిర్యాదు చేస్తే అరెస్టులు.. నేను ఫిర్యాదు చేస్తే ఎఫ్ఐఆర్ కూడా చేయరా?' అని కాంగ్రెస్ సీనియర్ నేత వీ హనుమంతరావు విరుచుకుపడ్డారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రిజర్వేషన్లను రద్దు చేస్తామని అన్నట్టు ఫేక్ వీడియో తయారు చేశారని బీజేపీ అగ్రనేత అమిత్‌షా ఫిర్యాదు చేస్తే 24 గంటల్లో అరెస్టులు చేసిన పోలీసులు.. మరి తాను అనని మాటలు అన్నట్టుగా ఒక పత్రిక రాసిందని ఫిర్యాదు చేస్తే కేసు ఎందుకు పెట్టడంలేదని ప్రశ్నించారు. దేశమంతా మోదీ ప్రభంజనం నడుస్తున్నదని, కాంగ్రెస్ గెలువడం కష్టమే అని తాను అన్నట్టుగా ఒక పత్రిక కథనాన్ని ప్రచురించిందని, తన ప్రతిష్ఠను దెబ్బతీసే కథనం ప్రచురించిన పత్రికపై ఫిర్యాదు చేస్తే ఎందుకు చర్య తీసుకోవడం లేదని నిలదీశారు.

6న కవిత బెయిల్ పిటిషన్ తీర్పు

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ లిక్కర్ పాలసీ అంశంలో అరెస్టయిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సంబంధించిన బెయిల్ పిటిషన్‌పై ఈనెల 6న తీర్పు వెలువడనున్నది. సీబీఐ, ఈడీలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అభియోగాలు మోపడం, రౌస్ అవెన్యూ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం కవితకు జ్యుడీషియల్ రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన కవిత తరపున గురువారం న్యాయవాదులు వాదనలు వినిపించారు. వాదనలు విన్న ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి కావేరి బవేజా తుది తీర్పును ఈనెల 6కు వాయిదా వేశారు.

ఇంటి వద్దే ఓటింగ్ ప్రక్రియ షురూ!

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గురువారం నుంచి లోక్‌సభ ఎన్నికలకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే ప్రక్రియను ఎన్నికల అధికారులు ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకేరోజు కాకుండా వెసులుబాటును బట్టి శుక్ర, శనివారాల్లో కూడా హోంఓటింగ్ ప్రారంభకానున్నది. రాష్ట్రవ్యాప్తంగా 23,248 మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. హోం ఓటింగ్‌కు 806 బృందాలు, 885 రూట్లుగా ఎన్నికల అధికారులు విభజించారు. ఒక్కో బృందంలో పోలింగ్ అధికారులతోపాటు వీడియో చిత్రీకరణ బృందం కూడా ఉంటుంది. హోంఓటింగ్‌ను ఈ నెల 6 కల్లా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది.

నల్లగొండ ఎమ్మెల్సీ ఉపఎన్నికకు నోటిఫికేషన్

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నికకు రిటర్నింగ్ అధికారి, నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 9 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 10న నామినేషన్ల పరిశీలన, 13 వరకు ఉపసంహరణ, అదే రోజు తుది అభ్యర్థుల ప్రకటన ఉంటుంది. ఈ నెల 27న పోలింగ్ జరుగుతుంది. జూన్ 5న ఓట్లను లెక్కిస్తారు. తొలిరోజైన గురువారం ముగ్గురు అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థిగా బండారు నాగరాజు, ప్రజావాణి పార్టీ నుంచి పాటి శ్రీకాంత్‌రెడ్డి, తెలంగాణ సకల జనుల పార్టీ నుంచి నందిపాటి జానయ్య నామినేషన్లు వేశారు.

అందరినీ సమదృష్టితో చూడండి: ఈసీ

హైదరాబాద్, మే 2(నమస్తే తెలంగాణ): ఎన్నికల విధుల నిర్వహణ సందర్భంగా ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులను సమదృష్టితో చూడాలని కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీశ్ వ్యాస్ రాష్ట్ర ఎన్నికల అధికారులను ఆదేశించారు. వారు ఇచ్చే ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విధులు నిర్వహించాలని ఆయన స్పష్టంచేశారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను వ్యాస్ గురువారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్లు, పోలీస్ సూపరింటెండెంట్లు, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల పరిశీలకులతోపాటు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, వ్యయ నోడల్ అధికారి మహేశ్ భగవత్, అదనపు డీజీ సంజయ్ జైన్, అదనపు సీఈవో లోకేశ్ కుమార్, సంయుక్త సీఈవో సర్వరాజ్ అహ్మద్ తదితరులు సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఈవీఎంలు, పోలింగ్ కేంద్రాలు, ఓటర్లకు కల్పిస్తున్న సౌకర్యాలు, వైద్య బృందాలు, స్ట్రాంగ్ రూమ్‌లకు అందించాల్సిన భద్రత తదితర అంశాలపై వ్యాస్ ఆదేశాలు జారీచేశారు. ముఖ్యంగా పోలింగ్‌కు ముందు 72గంటలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి పొరపాటు జరిగినా క్షమించే ప్రసక్తే ఉండదని వ్యాస్ స్పష్టంచేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లలోని పలు ప్రాంతాల్లో అదనపు భద్రతా బలగాలను మోహరించాలని ఈ సందర్భంగా రాష్ట్ర అధికారులు కోరారు.

కాంగ్రెస్ 'ట్యాక్స్'లపై మౌనం

- కమీషన్ల పాలన సాగుతున్నదని బీజేపీ ఆరోపణలు
- ఆర్, ఆర్ఆర్, ఆర్బీ, ఆర్జీ, ఆర్ఆర్ఆర్ ట్యాక్సులంటూ రోజుకో పేరు
- ఆధారాలతో సహా బయటపెడతామంటూ ప్రగల్భాలు
- గల్లీ లీడర్ మొదలు ప్రధాని మోదీ వరకు కలవరింతలు
- ఆరోపణలు సరే.. చర్యలెందుకు లేవనే అనుమానాలు
- ఇద్దరి మధ్య లోపాయికారి ఒప్పందమని ఆరోపణలు

- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాష్ట్రంలో 'ఆర్' ట్యాక్స్ మొదలైంది.
- కొత్తగా బీ ట్యాక్స్ ప్రారంభమైంది.
- ఆర్జీ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. ఢిల్లీకి, బెంగళూరుకు కప్పం కడుతున్నారు.
- రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. తెలంగాణ డబ్బులను కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఎన్నికల ఖర్చుకోసం వాడుకుంటున్నది.
- రాష్ట్రంలో ఆర్ఆర్ ట్యాక్స్‌కు తోడు మరో ఆర్ కలిసింది. ట్రిపుల్ ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): రెండు మూడు నెలలుగా బీజేపీ రాష్ట్ర నేత లు చేస్తున్న ఆరోపణలు ఇవి. ఏకంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కూడా 'రాష్ట్రంలో ఆర్ ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు' అంటూ బహిరంగసభలో విమర్శించిన పరిస్థితి.'ట్యాక్స్' వసూలు ఆరోపణలను మొదట్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రారంభించగా.. బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి మరో స్థాయికి తీసుకెళ్లారు. కే లక్ష్మణ్ వంటి కీలక నేతలు సైతం తరచూ ఇవే విమర్శలు చేస్తున్నారు. తెలంగాణలో సొమ్ము వసూలు చేసి.. ఢిల్లీకి సూట్‌కేసులు మోస్తున్నారంటూ పదేపదే చెప్తున్నారు. కాంగ్రెస్ తెలంగాణ డబ్బును దేశవ్యాప్తంగా ఎన్నికల ఖర్చుకోసం వాడుతున్నదంటూ మీడియాలో, సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. కర్ణాటకలో కమీషన్ల వసూలు చేసి తెలంగాణ ఎన్నికల్లో వాడారని, ఇప్పుడు తెలంగాణలో వసూలు చేసి కర్ణాటకకు తరలిస్తున్నారని కూడా ఆరోపిస్తున్నారు.

ఆరోపణలు సరే.. చర్యలేవి?

బీజేపీ గల్లీ లీడర్లు మొదలు ఢిల్లీ నేతల దాకా కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తున్నారు సరే.. 'మరి చర్యలు ఏవి?' అన్న ప్రశ్న ప్రజలందరిలో మెదులుతున్నది. ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలున్న చోట ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు స్పెషరవిహారం చేస్తున్న విషయాన్ని రాజకీయ విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. అలాంటిది కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్రంలోని బీజేపీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రతిఒక్కరూ ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర నేత లు కూడా ప్రతిరోజూ ఆరోపణలు చేయడమే తప్ప ఈడీకో, సీబీఐకో ఫిర్యాదు చేసిన దాఖలాలు కూడా లేవని చెప్తున్నారు. ఇవిగో ఆధారాలు.. అదిగో ఆధారాలు అంటూ రాజకీయంగా పబ్బం గడుపుకోవడం తప్ప, ఆ ఆధారాలతో ఎందుకు ఫిర్యాదు చేయడం లేదని నిలదీస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో చిన్న ఆరోపణలు, పాత కేసులను అడ్డం పెట్టుకొని ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగుతున్నాయని గుర్తు చేస్తున్నారు. ఇందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయని అంటున్నా రు. నిరుడు తమిళనాడులో ఇసుకను అక్రమంగా మైనింగ్ చేస్తున్నారంటూ ఈడీ అధికారులు దాడులు చేసిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. 2020 జూలైలో అశోక్ గెహ్లాట్ సీఎం గా ఉండగా ఆయన సోదరుడి ఇండ్లలో సోదా లు జరిపారని, 2007-09 మధ్య ఎరువుల ను పక్కదారి పట్టించారనే ఆరోపణలతో ఈ సోదాలు జరిగాయనంటున్నారు. ఇలా చిన్నచిన్న కారణాలకే ఈడీ రంగంలోకి దిగుతుండగా.. రాష్ట్రంలో మూడునాలుగు రకాల కమీషన్లు వసూలు చేస్తుంటే ఎందుకు మిన్నకుండిపోయాయని అడుగుతున్నారు. 'ఈడీ ఎక్క డ?.. సీబీఐ ఎందుకు రావడం లేదు?.. ఇతర దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయి?' అని ప్రశ్నిస్తున్నారు.

ప్రతిపక్షమైనా.. చర్యలెందుకు లేవు?

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పదేండ్లుగా ప్రతిపక్ష నేతలను ఇబ్బంది పెట్టేందుకే ఈడీ, సీబీఐని వాడుతున్నదనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. పదేండ్లలో నమోదైన ఈడీ, సీబీఐ కేసుల్లో 97శాతం ప్రతిపక్ష నేతలు, వారి సన్నిహితులపై నమోదైనవేనని చెప్తున్నారు. అయినా రాష్ట్రంలో ఎందుకు చర్యలు లేవని ప్రశ్నిస్తున్నారు. మోదీ ఆరోపించిన తర్వాత కూడా ఫిర్యాదో, దర్యాప్తో లేకపోవడాన్ని బట్టి రెండు పార్టీల మధ్య లోపాయకారీ ఒప్పందం జరిగినట్టు అనుమానపడాల్సి వస్తున్నదని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

రాష్ట్రంలో ఆర్ఆర్ఆర్ ట్యాక్స్

- రాహుల్, రేవంత్‌కు రియల్ ఎస్టేట్ ట్యాక్స్ జత కలిసింది
- చారాణా ఢిల్లీకి.. బారాణా ఇక్కడే ఖర్చు చేస్తున్న రేవంత్
- బీజేఎల్పీ నేత మహేశ్వర్ ఆరోపణ

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఆర్ఆర్ ట్యాక్స్‌కు కొత్తగా మరో ఆర్ ట్యాక్స్ జతకలిసిందని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. ట్రిపుల్ ఆర్ ట్యాక్స్ అంటే.. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, రియల్ ఎస్టేట్ ట్యాక్స్ అని పేర్కొన్నారు. రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడా రు. సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాల పునాదుల మీద రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని, గద్దెనెక్కిన 24 గంటల నుంచే దోపిడీ మొద లు పెట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభు త్వం వచ్చిన తర్వాత హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో మూడు నెలలుగా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. బెంగళూరులో డీకే శివకుమార్ ఒక్కో స్క్వేర్ ఫీట్‌కు రూ.75 వసూలు చేస్తున్నారని, కాబట్టి తనకు రూ.100 కావాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారని చెప్పారు. చివరికి రూ.68కి సెటిల్‌మెంట్ జరిగిందని ఆరోపించారు. ఢిల్లీకి పంపాలి కాబట్టి పూర్తిగా నగదు రూపంలోనే తీసుకుంటున్నారని వివరించారు. వసూలు చేసిన దాంట్లో చారాణా (25శాతం) ఢిల్లీకి పంపుతున్నారని, బారా ణా (75 శాతం) ఇక్కడే ఎన్నికల్లో ఖర్చు చేస్తున్నారని చెప్పారు. ఇలా కొత్తగా 120 ప్రాజెక్టులతో ప్రభుత్వం సెటిల్‌మెంట్ చేసి, అనుమతులు ఇచ్చిందని ఆరోపించారు. ట్రిపుల్ ఆర్ ట్యాక్స్ రూపంలో రూ.వేల కోట్ల అవినీతి జరిగిందని చెప్పారు. వసూళ్లకు భయపడి రియల్టర్లు, బిల్డర్లు హైదరాబాద్‌లో కాలు పెట్టడానికి భయపడుతున్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఎన్నోసార్లు ఖజానా ఖాళీ అ య్యిందని చెప్పారని గుర్తుచేశారు. మరి సీఎం పీఠంపై కూర్చున్న తర్వాత లంకె బిందెలు ఉన్నాయని ఎలా అనుకున్నారని ప్రశ్నించారు. ఏడాది కడుపు కట్టుకుంటే రూ.40వేల కోట్లు వస్తాయని, వాటిని సంక్షేమ పథకాలకు ఖర్చు చేస్తానని రేవంత్‌రెడ్డి అంటున్నారన్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డికి చెందిన కొత్త అవినీతిని బయటకు తీసుకువస్తానని వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అయినా తప్పుడు హామీ లు ఇచ్చే వారిని నమ్మవద్దని ప్రజలను కోరారు.

అస్సాంలో మొక్క నాటుతున్న ప్రకృతి ప్రేమికుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత జాదవ్‌పాయంగ్, గ్రీన్ ఇండియా చాలెంజ్ కో-ఫౌండర్ కరుణాకర్‌రెడ్డి, రితిరాజ్‌పుకాన్

పచ్చని పుడమికి వృక్షవేద్ అరణ్య

- ప్రారంభించిన పద్మశ్రీ జాదవ్, మాజీ ఎంపీ సంతోష్‌కుమార్
- అస్సాంలోని జోర్హట్ అడవిలో పదివేల మొక్కలు నాటే ప్రణాళిక

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): గ్రీన్ ఇండియా చాలెంజ్ ద్వారా మొక్కల పెంపకం, పర్యావరణహిత కార్యక్రమాలను చేపట్టిన రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్ కుమార్ మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అస్సాంకు చెందిన ప్రముఖ ప్రకృతి ప్రేమికుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత జాదవ్ పాయంగ్‌తో కలిసి అస్సాంలో 'వృక్షవేద్ అరణ్య' అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పచ్చని భవితకు బాటలు వేసి, పర్యావరణాన్ని కాపాడాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అస్సాంలోని జోర్హట్ అటవీ ప్రాంతం అరుణాచల ద్వీపంలో ఉన్న మొలాయికథోనిలో గురువారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వృక్షవేద్ అరణ్యలో భాగంగా పదివేల మొక్కలు నాటబోతున్నట్టు జాదవ్‌పాయంగ్ వెల్లడించారు. కార్యక్రమంలో గ్రీన్ ఇండియా చాలెంజ్ కో-ఫౌండర్ కరుణాకర్‌రెడ్డి, రితిరాజ్‌పుకాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాదవ్‌పాయంగ్ మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాలకు మనం అందించే అత్యంత విలువైన సంపద వృక్ష సంపద అని, వృక్షాలను కొట్టివేయకుండా పెంచాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. వృక్షాలు కూడా మనుషులలాగే జీవాలని, అవి తాము బతుకుతూ, మనకు బతుకును ఇస్తున్నాయని, వాటిని కాపాడుకోవడం ప్రతి మనిషి బాధ్యత అని చెప్పారు. గ్రీన్‌ఇండియా చాలెంజ్ ద్వారా సంతోష్‌కుమార్ పర్యావరణానికి చేస్తున్న కృషికి వెలకట్టలేమని కొనియాడారు. ప్రతి ఒక్కరూ మూడు మొక్కలు నాటాలంటూ సంతోష్‌కుమార్ చేస్తున్న ప్రయత్నం విజయవంతమైందని, దీనిని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని చెప్పారు.

చెట్లపై జాదవ్‌పాయంగ్ ప్రేమకు నిదర్శనం: సంతోష్‌కుమార్

జాదవ్‌పాయంగ్ వృక్ష వేద అరణ్య కార్యక్రమాన్ని ప్రారంభించడంపై మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ సంతోషం వ్యక్తంచేశారు. చెట్లపై జాదవ్‌పాయంగ్‌కు ఉన్న ప్రేమకు నిదర్శనం ఈ కార్యక్రమం అని అభివర్ణించారు. పర్యావరణాన్ని కాపాడుకునేందుకు జరుగుతున్న ప్రయత్నంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

పులుల అభయారణ్యం నుంచి పునరావాసానికి

- 94 కుటుంబాల గృహప్రవేశం

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): కవ్వాల్ పులుల అభయారణ్యం నుంచి మైసంపేట్, రాంపూర్ గ్రామాలకు చెందిన 94 కుటుంబాలకు పునరావాసాల తరలింపు ప్రక్రియ పూర్తయిందని అటవీ సంరక్షణ ప్రధానాధికారి ఆర్ఎం డోబ్రియాల్ తెలిపారు. అటవీ జంతువుల సంరక్షణ, వాటి పునరుత్పాదకత కోసం గ్రామాలను ఖాళీ చేసి పునరావాసాన్ని కల్పించడం ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో మొట్టమొదటిసారని తెలిపారు. గురువారం గ్రామస్థులందరూ ఒకేసారి గృహప్రవేశాలు చేశారు. ఈ రెండు గ్రామాలకు చెందిన 142 కుటుంబాలను అధికారులు పునరావాసం కోసం ఎంపిక చేయగా, వీరిలో 48 కుటుంబాలు ఏకమొత్తంగా రూ.15 లక్షల పరిహారానికి అంగీకరించారు. మిగిలిన 94 కుంటుంబాలకు అవే రూ.15లక్షల పరిహారంలో భాగంగా ఒక ఇల్లు, వ్యవసాయ భూమిని అందించేందుకు అటవీశాఖ ఒప్పించింది. కవ్వాల్‌కు సమీపంలోనే కొత్త మద్దిప